పసిడి రుణాలకు కళ్లెం!

నిబంధనలను కఠినతరం చేసే యోచనలో రిజర్వుబ్యాంక్

న్యూఢిల్లీ, మార్చి 7: పసిడి రుణాలకు కళ్లెం వేయడానికి రిజర్వు బ్యాంక్ సిద్ధమవుతున్నది. ఇబ్బడిముబ్బడిగా తీసుకుంటున్న గోల్డ్ లోన్లకు చెక్ పెట్టడానికి త్వరలో కఠిన నిబంధనలను అమలులేకి తేవాలని చూస్తున్నది. ఇందుకు సంబంధించి బ్యాంకులు, నాన్-బ్యాంకింగ్ ఆర్థిక సేవల సంస్థలు జారీ చేస్తున్న గోల్డ్ లోన్లపై నిఘా పెట్టాలని సూచించింది. గోల్డ్ లోన్ తీసుకున్నవారు ఈ నిధులను దేనికి వినియోగిస్తున్నారు.. అసలు బంగారం వారిదేనన్న దానిపై పూర్తి వివరాలు సేకరించాలని బ్యాంకులకు సూచించింది. గడిచిన ఆరు నెలల్లో దేశవ్యాప్తంగా బంగారం తాకట్టుపై రుణాలు 50 శాతానికి పైగా పెరగడంపై ఆందోళన వ్యక్తం చేసిన సెంట్రల్ బ్యాంక్.. దీనిపై ప్రత్యేక దృష్టి సారించింది. ధరలు రికార్డు స్థాయికి చేరుకోవడం వల్లనే రుణాలు అత్యధికంగా తీసుకుంటున్నారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తీసుకున్న రుణాలు వారు దేనికి వినియోగిస్తున్నారన్న విషయంపై మానిటర్ చేయాలని సూచించింది. రుణాలు తీసుకున్నవారి కుటుంబ వివరాలు, పసిడి వారిదేనా లేకపోతే ఇతరవారు వీరిపై తీసుకుంటున్నారా అనేదానిపై సమాచారం సేకరించాలని పేర్కొంది. ఇటీవల కాలంలో తమవద్ద ఉన్న బంగారాన్ని వేరేవారి పేరుమీద తీసుకొని ఇతర పెట్టుబడులు పెడుతున్నారనే సమాచారం ఆధారంగా ఆర్బీఐ ఈ నిర్ణయం తీసుకున్నది. ఒకవేళ తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించనియెడల ఈ బంగారాన్ని వేలం వేసే అవకాశం ఉంటుంది.

ఆరు నెలల్లో 50 శాతం వృద్ధి

పసిడి తాకట్టుపై రుణాలు తీసుకునేవారి సంఖ్య గణనీయంగా పెరగడంతో సెంట్రల్ బ్యాంక్ ఆందోళన వ్యక్తంచేసింది. గతేడాది సెప్టెంబర్ నుంచి ఇప్పటి వరకు పసిడి రుణాలు 50 శాతం పెరిగాయి. పసిడి వినిమయంలో రెండో అతిపెద్ద దేశమైన భారత్‌లో గోల్డ్ లోన్లకు అత్యధిక మంది ఆకర్షితులవుతున్నారు. గతేడాది సెప్టెంబర్‌లో ఎన్‌బీఎఫ్‌సీల గోల్డ్ లోన్లపై పరిమితులు విధించిన విషయం తెలిసిందే. గడిచిన 12 నుంచి 16 నెలల మధ్యకాలంలో నాన్-బ్యాంకింగ్ సంస్థలు జారీ చేసిన గోల్డ్ లోన్లపై ఆర్బీఐ ఆడిటింగ్ నిర్వహించగా, దీంట్లో ఎన్నో అనుమానాలు తలెత్తాయని, తీసుకున్నవారిలో సగానికి పైగా మంది వేరే అవసరాలకు వినియోగించారనే అనుమానం వ్యక్తంచేసింది.

కొలువులు ఆగమాగం

అన్ని రంగాలకూ ట్రంప్ సుంకాల సెగ • ఆందోళనలో ఉద్యోగుల భవిష్యత్తు

ఇప్పటికే మందగమనంలో దేశ జీడీపీ వృద్ధి • గుబులు పుట్టిస్తున్న కొత్త సవాళ్లు



న్యూఢిల్లీ, మార్చి 7: అమెరికా అధ్యక్షుడి పోకడ.. ఆయా దేశాల్లో పెద్ద ఎత్తునే ఉద్యోగుల ఉసురు తీసేలా ఉన్నది. ఆ జాబితాలో భారత్ కూడా కనిపిస్తుండటం ఆందోళన కలిగిస్తున్న అంశం. అవును.. ఇప్పటికే ద్రవ్యోల్బణం, తయారీసహా కీలక రంగాల్లో నిస్తేజం, జీడీపీ వృద్ధిరేటు మందగమనం, అధిక వడ్డీరేట్ల వంటి సమస్యలతో సతమతమవుతున్న దేశీయ వ్యాపార, పారిశ్రామిక రంగాన్ని ఇప్పుడు అగ్రరాజ్యాధినేత డొనాల్డ్ ట్రంప్ సుంకాల హెచ్చరికలు భయపెడుతున్నాయి. ఏప్రిల్ 2 నుంచి భారత్‌పై సుంకాలుంటాయంటున్న ట్రంప్ ప్రకటనలు నిజమైతే.. ఇండస్ట్రీ కుదేలవడం ఖాయమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతుండటం గమనార్హం. ముఖ్యంగా భారతీయ తయారీ, ఎగుమతుల రంగాలకు గట్టి ఎదురు దెబ్బేనంటున్నారు.

ఇదీ సంగతి..

'ఈ ఇంటికి ఆ ఇల్లు ఎంత దూరమో.. ఆ ఇంటికి ఈ ఇల్లూ అంతే దూరం' అంటున్నారు యూఎస్ బాస్ ట్రంప్. దీంతో ఆయా రంగాల్లో ఇప్పుడు అమెరికా వస్తూత్పత్తులపై భారత్ విధిస్తున్న సుంకాలకు తగ్గట్టుగా భారతీయ వస్తూత్పత్తులపై అమెరికా సుంకాలను వేయనున్నది. భారతీయ రత్నాలు, ఆభరణాల పరిశ్రమ విషయానికే వస్తే.. ట్రంప్ సుంకాల ప్రభావం దీనిపై భారీగానే ఉండే వీలున్నది. ప్రస్తుతం భారతీయ నగలకు అమెరికాలో మంచి డిమాండ్ ఉన్నది. దీంతో అక్కడికి మన ఎగుమతులు భారీగానే జరుగుతున్నాయి. అయితే సుంకాలు పెంచితే వీటి ధరలు అమాంతం పెరిగిపోతాయి. దాంతో వ్యాపారాలకు దెబ్బే. అమెరికా నుంచి భారత్‌కు వస్తున్న జ్యుయెల్లరీపై వాటి విలువలో కేంద్ర ప్రభుత్వం 20 శాతాన్ని సుంకాలుగా వసూలు చేస్తున్నది. కానీ భారత్ నుంచి అమెరికాకు చేరుతున్న నగలపై అక్కడ పడుతున్నది గరిష్ఠంగా 5.5-7 శాతమే. ఇక సానబెట్టిన వజ్రాలపై ఇక్కడ 5 శాతం సుంకం పడితే.. అమెరికాలో ఏమీ లేదు. ఈ లెక్కన ట్రంప్ హెచ్చరించినట్టుగా సుంకాలు పడితే జెమ్స్ అండ్ జ్యుయెల్లరీ ఇండస్ట్రీ కుదేలైనట్టే. దేశంలో 2 లక్షలకుపైగా జనాభా ఈ రంగం ద్వారా ఉపాధి పొందుతున్నది. వీరిలో మహిళలే ఎక్కువ. ఇప్పుడు టారిఫ్‌ల సెగ వీరందరికీ తగులుతున్నట్టే. ఇలాగే అనేక రంగాల పరిస్థితి నెలకొన్నది.

ఐటీ రంగానికీ తిప్పలే

భారతీయ ఐటీ రంగానికున్న ప్రధాన మార్కెట్లలో అమెరికా ఒకటి. అయితే తొలిసారి అగ్రరాజ్య అధ్యక్షుడైనప్పుడే దేశీయ ఐటీ రంగాన్ని ట్రంప్ తీవ్రంగా దెబ్బతీశారు. వీసా నిబంధనలు కఠినతరం, ప్రాజెక్టుల్ని దూరం చేయడం, అమెరికాలో అమెరికన్లతోనే పనిచేయించాలనడం వంటివి ఇండియన్ ఐటీ ఇండస్ట్రీకి ఇబ్బందుల్ని తెచ్చిపెట్టాయి. ఇక్కడి ఐటీ ఉద్యోగ నియామకాలనూ ప్రభావితం చేశాయి. అమెరికాలోనూ భారతీయులకు ఉద్యోగాలు తగ్గిపోయాయి. మళ్లీ ఇప్పుడు ట్రంప్ రావడంతో ఐటీ రంగంలోనూ ప్రకంపనలు మొదలవుతున్నాయి. ఇప్పటికే ఏఐ దెబ్బకు రిక్రూట్‌మెంట్లు మందగించిన విషయం తెలిసిందే. మొత్తానికి ట్రంప్.. ప్రధాని మోదీకి మధ్య సత్సంబంధాలే ఉన్నప్పటికీ.. దేశ ప్రయోజనాలే ముందు అంటున్నారు ట్రంప్. నిజానికి అమెరికా మోటర్‌సైకిళ్లు, విస్కీలపై 20 నుంచి 50 శాతం మేర సుంకాలను కేంద్రం తగ్గించింది. మరికొన్నింటిపైనా సమీక్ష జరుపుతున్నది. మరోవైపు వాణిజ్య మంత్రి గోయల్ అమెరికాలో చర్చల కోసం వెళ్లారు. ఇవన్నీ ఏ మేరకు ఫలిస్తాయో చూడాల్సిందే.



జాబ్ మార్కెట్ మటాష్!

ఇటీవలికాలంలో జాబ్‌మార్కెట్ అల్లకల్లోలంగానే తయారైంది. కృత్రిమ మేధస్సు (ఏఐ) దెబ్బకు ఉద్యోగావకాశాలు భారీగానే కోల్పోవాల్సి వస్తున్నది. దీనికితోడు దేశ, విదేశీ ప్రతికూల పరిస్థితులతో కంపెనీల ఆదాయాలు, లాభాలు తగ్గుముఖం పట్టాయి. ఫలితంగా కొత్త నియామకాలు అంతంతమాత్రంగానే తయారయ్యాయి. ఈ నేపథ్యంలో అమెరికా సుంకాలను పెంచితే.. ఆ ప్రభావం అక్కడి మార్కెట్‌లో మన వస్తువులకున్న డిమాండ్‌ను తప్పక ప్రభావితం చేయగలదు. ఇదే జరిగితే ఇక్కడి నుంచి అక్కడికి ఎగుమతులు పడిపోయి.. ఉత్పత్తి మందగిస్తుంది. దాంతో అంతిమంగా నష్టపోయేది ఉద్యోగులేనన్నది మార్కెట్ నిపుణుల విశ్లేషణ. నిజానికి కరోనా ప్రభావం నుంచి ఇప్పుడిప్పుడే మార్కెట్ కోలుకుంటున్నది. ఈ సమయంలో ట్రంప్ సుంకాల పిడుగు అంగట్లో గట్టిగానే అలజడులను సృష్టిస్తున్నదని చెప్పవచ్చు.

సుంకాలతో ఇబ్బందులు	ప్రభావిత రంగాలు	ఉపశమనం ఎలా?
భారంగా ఎగుమతుల ఖర్చులు	రత్నాలు, ఆభరణాలు	తయారీకి ప్రభుత్వ ప్రోత్సాహకాలు
పడిపోనున్న మార్కెట్ వాటా	ఫార్మా ఇండస్ట్రీ	పరిశ్రమలకు పన్ను మినహాయింపులు
తయారీ రంగం కుదేలు	ఉక్కు, అల్యూమినియం	సులభంగా రుణ లభ్యత
ఉద్యోగుల తొలగింపులు	టెక్స్‌టైల్స్ పరిశ్రమ	విదేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు
ఆర్థిక వ్యవస్థలో మందగమనం	ఎలక్ట్రానిక్స్	వినియోగదారుల కొనుగోలు శక్తి బలోపేతం

- *టారిఫ్‌ల దెబ్బకు వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో అమెరికాకు భారతీయ ఎగుమతులు 2 నుంచి 7 బిలియన్ డాలర్ల మేర పడిపోయే అవకాశం ఉందంటున్న ఇండియా రేటింగ్స్.*
- *ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) ఏప్రిల్-డిసెంబర్‌లో అమెరికాకు భారత ఎగుమతులు గతంతో పోల్చితే 5.57 శాతం పెరిగి 59.93 బిలియన్ డాలర్లుగా నమోదు. అమెరికా నుంచి దిగుమతులు కూడా 1.91 శాతం పెరిగి 33.4 బిలియన్ డాలర్లకు చేరిక.*
- *అమెరికా పెంచే సుంకాలతో భారత జీడీపీ వృద్ధిరేటు 5 నుంచి 10 బేసిస్ పాయింట్లు క్షీణించే వీలుందంటున్న ఇండియా రేటింగ్స్ ప్రధాన ఆర్థికవేత్త దేవేంద్ర కుమార్ పంత్.*

మహిళలకు ఎస్బీఐ చౌక రుణాలు

'నారీ శక్తి' డెబిట్ కార్డు పరిచయం

ముంబై, మార్చి 7: ఔత్సాహిక మహిళా వ్యాపార, పారిశ్రామికవేత్తలకు తక్కువ వడ్డీరేటుకే పూచీకత్తు లేకుండా రుణాలు మంజూరు చేస్తామని శుక్రవారం ఎస్బీఐ ప్రకటించింది. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం కావడంతో 'అస్మిత' పేరిట ఈ ప్రత్యేక లోన్లకు ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం శ్రీకారం చుట్టింది. బ్యాంక్ చైర్మన్ సీఎస్ శెట్టి మాట్లాడుతూ.. మహిళల ఆధ్వర్యంలో నడిచే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలకు వేగంగా, సులభంగా ఈ రుణాలను అందజేస్తామన్నారు. ఇదిలావుంటే 'నారీ శక్తి' ప్లాటినమ్ రూపే డెబిట్ కార్డునూ ఎస్బీఐ ఈ సందర్భంగా తీసుకొచ్చింది.

బీవోబీ నయా అకౌంట్స్

ప్రవాస భారతీయ మహిళల కోసం బ్యాంక్ ఆఫ్ బరోడా శుక్రవారం 'బోవోబీ గ్లోబల్ వుమెన్ ఎన్ఆర్ఈ, ఎన్ఆర్వో సేవింగ్స్ అకౌంట్'ను అందుబాటులోకి తెచ్చింది. గృహ, వాహన రుణాలపై చౌక వడ్డీ, తక్కువ ప్రాసెసింగ్ చార్జీలు, లాకర్ అద్దెపై 100 శాతం రాయితీ, ఎయిర్‌పోర్టుల్లో ఉచితంగా దేశీయ, అంతర్జాతీయ లాంజ్ సౌకర్యం పొందేలా కస్టమైజ్డ్ డెబిట్ కార్డు వంటి ప్రయోజనాలు ఈ ఖాతాదారులకుంటాయి.

ఎంఎస్ఎంఈలకు ప్రత్యేక క్లస్టర్లు

రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేసేందుకుగాను ఎంఎస్ఎంఈలకోసం ప్రత్యేకంగా క్లస్టర్లను ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఎఫ్‌టాప్సీ ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో 'ఎంఎస్ఎంఈ స్పార్క్-2.0' పేరిట ఏర్పాటు చేసిన సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎంఎస్ఎంఈ నిర్వాహకుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని, వారి ఉత్పత్తులను అంతర్జాతీయంగా మార్కెటింగ్ చేసుకొనేందుకు తగిన ప్రోత్సాహం అందిస్తామని పేర్కొన్నారు.

ఐఐటీ హైదరాబాద్‌తో కోలిండియా జట్టు

హైదరాబాద్, మార్చి 7 (నమస్తే తెలంగాణ) : పర్యావరణహిత, ఉద్గార రహిత బొగ్గు, ఇంధనాలపై పరిశోధనలకోసం ఐఐటీ హైదరాబాద్‌తో కోల్ ఇండియా కీలక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. రూ.98 కోట్ల గ్రాంట్‌తో సెంటర్ ఆఫ్ క్లీన్ కోల్ ఎనర్జీ అండ్ నెట్ జీరో(క్లీన్జ్) సంస్థను ఐఐటీహెచ్‌లో నెలకొల్పేందుకు ఇరు సంస్థలు జట్టుకట్టాయి. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో కేంద్ర బొగ్గుశాఖ మంత్రి జీ కిషన్‌రెడ్డి సమక్షంలో కోలిండియా సీఎండీ పీఎం ప్రసాద్, ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర బీఎస్ మూర్తిలు పరస్పర ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ వృద్ధికి బొగ్గురంగం అతి ముఖ్యమైనదని, ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ఇంధన వనరుగా కొనసాగుతున్న గణనీయమైన ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నదన్నారు.

ఉత్పాదక వ్యయం తగ్గాలి: సింగరేణి సీఎండీ బలరాం

బొగ్గు ఉత్పత్తి వ్యయం తగ్గినప్పుడే సంక్షేమం సాధ్యమని, ఉద్యోగుల పని సంస్కృతి మరింత మెరుగుపడాల్సిన అవసరముందని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం పేర్కొన్నారు. శుక్రవారం సింగరేణిభవన్‌లో 38వ స్ట్రక్చర్ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సింగరేణి బొగ్గు విక్రయ ధరలు కోల్ ఇండియా, విదేశీ బొగ్గు కన్నా అధికంగా ఉన్నాయని, దీంతో ఈ బొగ్గుకు డిమాండ్ క్రమంగా పడిపోతున్నదని, ఇది ఆందోళనకరమని ఆయన వ్యాఖ్యానించారు. బొగ్గు ఉత్పాదక వ్యయం రూ.12 వేల నుంచి రూ.16 వేల వరకు ఉంటుందన్నారు.

పెన్షన్ మొత్తాన్ని పెంచండి

సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్ మొత్తాన్ని పెంచాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డీ రామచందర్‌రావు కోరారు. ఈ మేరకు శుక్రవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, కోల్ ఇండియా చైర్మన్ పీఎం ప్రసాద్, సింగరేణి సీఎండీ బలరాంలను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. రిటైర్డ్ ఉద్యోగులకు మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని కోరగా, సానుకూలంగా స్పందించినట్లు రామచందర్‌రావు తెలిపారు.

33కేవీ ఇంటర్ లింక్ లైన్

పనుల్లో వేగం పెంచాలి

- **ఎస్ఈ రమేశ్ బాబు**

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ రమేశ్‌బాబు

ముకరంపుర, మార్చి 7: కరీంనగర్ సర్కిల్ పరిధిలో 33కేవీ ఇంటర్ లింక్ లైన్ పనుల్లో వేగం పెంచి, త్వరగా పూర్తి చేయాలని ఎస్ఈ రమేశ్ బాబు క్షేత్ర స్థాయి అధికారులను ఆదేశించారు. సర్కిల్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సర్కిల్ స్థాయి సమీక్షలో పలు అంశాలపై చర్చించారు. నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రగతిలో ఉన్న లైన్, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. వేసవి దృష్ట్యా విద్యుత్ వినియోగం పెరుగనున్నందున అందుకు అనుగుణంగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, సామర్థ్యం పెంచే పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. వ్యవసాయ విద్యుత్‌కు అంతరాయం లేకుండా చూడాలన్నారు. ప్రత్యామ్నాయ సరఫరాతో పాటు సరఫరాలో అంతరాయాన్ని తగ్గించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాలు, హాస్పిటళ్లు, వీఐపీ ప్రాంతాలకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. సమీక్షలో డీఈలు ఉపేందర్, రాజం, తిరుపతి, లక్ష్మీరెడ్డి, కాళిదాసు, చంద్రమౌళి, ఎస్ఏవో రాజేంద్రప్రసాద్, ఏడీలు, ఏఈలు, సబ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

రైల్వే మంత్రిత్వ శాఖ
(దక్షిణ మధ్య రైల్వే)
ప్రకటన

సికింద్రాబాద్, 28 ఫిబ్రవరి, 2025

S.O.1070(E) – రైల్వేల చట్టం 1989లోని సెక్షన్ 2 యొక్క క్లాజ్ (7A) ద్వారా సంక్రమించిన అధికారాల్ని వినియోగించుకుంటూ కేంద్ర ప్రభుత్వం అధికారిక రాజపత్రంలో ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి వర్తింపుతో సదరు టేబుల్‌లో కాలమ్ (3)లో తెలిపిన రాష్ట్రంలో అమలు, నిర్వహణ, మేనేజ్‌మెంట్ మరియు ఆపరేషన్ కొరకు, టేబుల్ యొక్క కాలమ్ (2)లో తెలిపిన విధంగా స్పెషల్ రైల్వే ప్రాజెక్టుకు సంబంధించి భూ సేకరణ కొరకు సమర్థ ప్రాధికారి విధులను నిర్వర్తించేందుకు దిగువ టేబుల్‌లో కాలమ్ (5)లో తెలిపిన అధికారికి ఇందుమూలముగా అధికారం ఇచ్చినది.

టేబుల్

క్ర. సం.	ప్రత్యేక రైల్వే ప్రాజెక్టు	రాష్ట్రం	జిల్లా	భూసేకరణ కొరకు సమర్థ ప్రాధికారి
(1)	(2)	(3)	(4)	(5)
1	రామగుండం మరియు పెద్దంపేట్ స్టేషన్స్ మధ్య కి.మీ. 270/26-28 వద్ద లెవల్ క్రాసింగ్ నెం. 52(ఎమ్) స్థానంలో రోడ్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం.	తెలంగాణ	పెద్దపల్లి	రెవెన్యూ డివిజినల్ అధికారి, పెద్దపల్లి.
2	పెద్దపల్లి మరియు రాఘవాపురం స్టేషన్స్ మధ్య కి.మీ. 284/40-44 వద్ద లెవల్ క్రాసింగ్ నెం. 45 స్థానంలో రోడ్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం.			
3	పెద్దపల్లి మరియు రాఘవాపురం స్టేషన్స్ మధ్య కి.మీ. 289/14-16 వద్ద లెవల్ క్రాసింగ్ నెం. 42 స్థానంలో రోడ్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం.			
4	కొలనూర్ మరియు పెద్దపల్లి స్టేషన్స్ మధ్య కి.మీ. 295/20-24 వద్ద లెవల్ క్రాసింగ్ నెం. 38 స్థానంలో రోడ్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం.			
5	కొలనూర్ మరియు పెద్దపల్లి స్టేషన్స్ మధ్య కి.మీ. 304/46-48 వద్ద లెవల్ క్రాసింగ్ నెం. 34 (ఎమ్) స్థానంలో రోడ్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం.			

[File No.: DYCE/CON/RSP/ROB/LAND AQ/2025/7A/101]

(మనోజ్ కుమార్),
చీఫ్ ఇంజినీర్/C/RSP/S.C.Rly/Secunderabad

AD289

సంపూర్ణ ఆరోగ్యంతోనే సమాజావృద్ధి

- కలెక్టర్ పమేలా సత్పతి

మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, మార్చి 7 : నేటి యాంత్రిక జీవనంలో మహిళలు సంపూర్ణ ఆరోగ్యాన్ని కలిగి ఉంటేనే సమాజం అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహిళలు ఆరోగ్య పరంగా ఎదుర్కొంటున్న సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకే శుక్రవారం సభలు నిర్వహిస్తూ, ఆరోగ్యపరైమన సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని అర్బన్ అంగన్‌వాడీ ప్రాజెక్టు పరిధిలోని బాబూ జగ్జీవన్‌రామ్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో మహిళాభివృద్ధి, శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శుక్రవారం సభలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రంలో జరిగే ఈసభకు వస్తే మహిళలు అన్ని ఆరోగ్య విషయాలు తెలుసుకోవచ్చన్నారు. మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, ఊరు తద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. భోజనంలో అన్ని పోషకపదార్థాలు తగిన పాళ్లలో ఉండేలా చూసుకోవాలని సూచించారు. గర్భిణీగా నిర్ధారణ అయినప్పటి నుంచి మొదటి వెయ్యి రోజులు పోషకాహారం తీసుకుంటేనే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా ఉంటుందన్నారు. గర్భిణులు తప్పనిసరి కాల్షియం, ఐరన్ మాత్రలు వినియోగించాలని విజ్ఞప్తి చేశారు. ఆరోగ్య మహిళ కార్యక్రమంలో 54 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేయించుకోవచ్చని, మహిళలంతా విధిగా ప్రభుత్వ దవాఖానలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రైవేట్ హాస్పిటళ్లలో ఈ పరీక్షలకు రూ.40వేలకు పైగా ఖర్చవుతుందని వెల్లడించారు. ఉచిత వైద్య సేవలతో పాటు వారికి నిర్ధారించిన వ్యాధుల నిర్మూలనకవసరమైన మందులు కూడా ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీప్రైమరీ పాఠశాలలుగా మార్చి నాణ్యమైన ఉచిత విద్య అందిస్తున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలకు తమ పిల్లలను పంపాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. కిసాన్‌నగర్ పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేసేందుకు అవసరమైన అదనపు గది నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో సబిత, మెప్మా పీడీ వేణుమాధవ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.సుజాత, డీసీపీవో పర్వీన్, పీవో సనాతో పాటు పలువురు అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

పెండ్లి కొడుకుపై కేసు

- బరాత్ వేడుకల్లో బంధువుపైకి దూసుకెళ్లిన కారు
- చికిత్స పొందుతూ మహిళ మృతి

ఉమ (ఫైల్)

శంకరపట్నం, మార్చి 7: బరాత్ వేడుకల్లో ప్రమాదవశాత్తూ బంధువులపైకి కారు దూసుకెళ్లడంతో ఓ మహిళ మృతి చెందింది. దీంతో పెండ్లి కొడుకుపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మెట్‌పల్లి గ్రామంలో బాకారపు ప్రభాకర్ కూతురు నవ్య వివాహం మానకొండూర్ మండలం చెంజర్ల గ్రామానికి చెందిన జినుక అశోక్‌తో గురువారం జరిగింది. అప్పగింతల తర్వాత రాత్రి వేళలో బరాత్ వేడుక నిర్వహించారు. అందరూ ఉత్సాహంతో డీజే పాటలకు నృత్యం చేస్తున్నారు. అయితే కారు డ్రైవర్ కురుమ శ్రవణ్ కిందకు దిగగా, పెండ్లి కొడుకు జినుక అశోక్ కారును ముందుకుతీశాడు. ఈ క్రమంలో అదుపు తప్పిన కారు ఒక్కసారిగా డ్యాన్స్ చేస్తున్న, పక్కన నిలబడి చూస్తున్న ఉన్న వారిపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో బాకారపు ఉమ (35), ఆమె కూతురు నిఖితతోపాటు మరో పది మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే దవాఖానలకు తరలించారు. బాకారపు ఉమను వరంగల్ ఎంజీఎంకు అక్కడి నుంచి హైదరాబాద్ దవాఖానకు తరలిస్తుండగా శుక్రవారం తెల్లవారుజామున మార్గం మధ్యలో మృతి చెందింది. మృతదేహాన్ని బంధువులు హుజూరాబాద్ మార్చురీకి తరలించారు. తమకు న్యాయం చేయాలని శుక్రవారం ఉదయం బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు దవాఖాన ఎదుట ధర్నా చేశారు. ఉమ భర్త పరశురాములు ఫిర్యాదు మేరకు అశోక్‌పై కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రవి తెలిపారు.

గ్రామస్తుల ఆందోళన

హుజూరాబాద్, మార్చి 7: మెట్‌పల్లిలో పెళ్లి ఊరేగింపు ఘటనలో మృతిచెందిన బాకారపు ఉమ కుటుంబానికి న్యాయం చేయాలని శుక్రవారం హుజూరాబాద్ ఏరియా హాస్పిటల్ ఎదుట గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. ఉమ మృతదేహాన్ని హుజూరాబాద్ ఏరియా దవాఖానకు తీసుకొని రాగా, హాస్పిటల్ ఎదుట ఆందోళనకు దిగడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. టౌన్ సీఐ తిరుమల్ గౌడ్ తన సిబ్బందితో వచ్చి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

గ్రామ దేవతల ఆలయాల్లో చోరీ

శంకరపట్నం, మార్చి 7: మండలంలోని మొలంగూర్ గ్రామంలో గురువారం రాత్రి గ్రామ దేవతలు పోచమ్మ, రేణుకా ఎల్లమ్మ గుళ్లలో చోరీలు జరిగాయి. గ్రామస్తుల కథనం ప్రకారం.. ఆ రెండు ఆలయాల్లో గుర్తు తెలియని దుండగులు తాళాలు పగులగొట్టి చొరబడ్డారు. హుండీల తాళాలు పగులగొట్టి నగదును ఎత్తుకెళ్లినట్లు నిర్వాహకులు తెలిపారు. ఇలా ఆయా ఆలయాల్లో చోరీలు జరుగడం ఇటీవలి కాలంలో ఇది మూడోసారి. మరో పక్క వ్యవసాయ బావుల వద్ద కరెంటు మోటర్లు కూడా తరచూ చోరీకి గురవుతున్నాయని, పోలీసులకు ఫిర్యాదు చేసినా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహించి దొంగతనాలకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

కార్పొరేషన్, మార్చి 7: ఎల్ఆర్ఎస్ పథకంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 31 వరకు ఇచ్చిన 25శాతం డిస్కౌంట్‌ను దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని సుడా చైర్మన్ కొమటిరెడ్డి నరేందర్‌రెడ్డి సూచించారు. శుక్రవారం స్థానిక సుడా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం అనేక సదుపాయాలను కల్పించిందన్నారు. రానున్న రోజుల్లో ఎల్ఆర్ఎస్ లేకుండా ప్లాట్ల విక్రయాలు జరిగే అవకాశం ఉండదన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రతిఒక్కరూ తమ దరఖాస్తులను పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేశంలో సుడా వైస్ చైర్మన్ ప్రఫుల్‌దేశాయ్, అధికారి ఆంజనేయులు, తదితరులు ఉన్నారు.

బిల్లులు చెల్లించాలంటూ ఆందోళన

హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చాంబర్ ఎదుట ఆందోళన చేస్తున్న కాంట్రాక్టర్

కార్పొరేషన్, మార్చి 7: తాము చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త కాంట్రాక్టర్ల ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క చాంబర్ ఎదుట ఆందోళన చేశారు. కరీంనగర్ నగరపాలక సంస్థకు చెందిన కాంట్రాక్టర్లు కూడా ఈ ఆందోళనలో పాల్గొన్నారు. నగరపాలక సంస్థలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు ఏడాది కాలంగా రావడం లేదని, వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో నగరానికి చెందిన కాంట్రాక్టర్లు మహేందర్,చిందం శ్రీనివాస్,రఘు, ఆకుల మోహన్, తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఆస్తి పన్నులు వసూలు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కార్పొరేషన్, మార్చి 7: ఈ ఆర్థిక సంవత్సరంలో నగరంలో వంద శాతం ఆస్తి పన్నులు వసూలు చేయాలని నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో వార్డు ఆఫీసర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, వార్డు ఆఫీసర్లు డివిజన్లలో ఆస్తి పన్నులు వసూలు చేసి ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ప్రతి రోజు ఉదయమే క్షేత్రస్థాయిలోకి వెళ్లి ప్రతి ఇంటి నుంచి పన్నులు వసూలు చేయాలని కోరారు. అలాగే ప్రభుత్వ శాఖల పన్నులతో పాటు, కాంప్లెక్స్‌లు, అపార్ట్మెంట్లు, హోటల్స్, రెస్టారెంట్స్, ఫంక్షన్ హాల్స్, హాస్పిటల్స్ లాంటి వాటి నుంచి కూడా వచ్చే పన్నులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. చాలా కాలంగా పన్నులు కట్టకుండా ఉన్న వారి నుంచి పూర్తి స్థాయిలో బకాయిలను వసూలు చేయాలన్నారు. పన్నులు చెల్లించని బకాయిదారులకు చట్టప్రకారం నోటీసులు ఇవ్వాలన్నారు. రూ.50 వేల కంటే ఎక్కువ ఉన్న అన్ని పన్నులపై దృష్టి పెట్టి లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి, రెవెన్యూ అధికారులు, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడి మృతి

తెలంగాణచౌక్, మార్చి 7: ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికుడు గుండెపోటుతో మృతి చెందారు. ఆర్టీసీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. వీణవంక మండలం రెడ్డిపల్లి గ్రామానికి చెందిన వడ్లపల్లి ఓదెలు(55) కరీంనగర్ పట్టణంలోని ఓ ఏటీఎం వద్ద సెక్యూరిటీగార్డుగా పనిచేస్తున్నాడు. డ్యూటీకి వెళ్లేందుకు గానూ జమ్మికుంట నుంచి పల్లె వెలుగు బస్సులో కరీంనగర్‌కు బస్సులు బయలుదేరాడు. సదరు బస్సు కరీంనగర్ బస్టాండ్‌కు చేరుకోగా ప్రయాణికులందరూ దిగిపోయారు. ఓదెలు ఒక్కడే సీటులో ఉండడాన్ని గమనించిన కండక్టర్ అతడి వద్దకు వెళ్లి పలుకరించగా ఉలుకుపలుకు లేదు. దీంతో అనుమానం వచ్చి బస్టాండ్‌లోని అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ సురేశ్‌కు ఈ విషయాన్ని చెప్పాడు. దీంతో వారి సమాచారం మేరకు 108సిబ్బంది ఓదెలును పరిశీలించి, అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఆర్టీసీ అధికారులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించగా, వారు మృతదేహాన్ని ప్రభుత్వ దవాఖానకు తరలించారు.